


# నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

### *తెలివిగల వాళ్ళు*

**ధర్మేంద్రని ఆఖరుసారిగా అడిగింది భార్య...**

"అయితే మీరు వెళ్ళక తప్పదా?"

"తప్పదు. ఫ్రెండ్స్ అంతా కలిసి ముందే ఈ ప్రోగ్రామ్ వేసుకున్నాం. పైగా ఇంకెవరికీ కార్లు లేవు. అంతా నా కారులోనే వెళ్ళాలి. నేను ఇప్పుడు మానేస్తే వాళ్ళు డిజప్పాయింట్ అవుతారు"

"అసలు మీకు ఈ వేట పిచ్చి కొత్తగా ఎందుకు పుట్టాలి, నా ఖర్మ కాకపోతే" బాధగా వాపోయింది శ్రీమతి ధర్మేంద్ర.

"శనాదివారాలేగా..సోమవారం ఉదయానికల్లా ఇంట్లో వుంటాను..క్రిందటి సారిలా ఏ కుందేలునో, దుప్పినో కొట్టుకు వస్తాను. చూస్తూండు.."

"డాడీ! పులిని తీసుకురా" ఉత్సాహంగా అడిగాడు పుత్రరత్నం.

"పులిని వేటాడితే జైల్లో పెడతారు"

వీరేంద్ర భార్య , భర్త బట్టలు లైసెన్సుగల తుపాకిని సూట్‌కేసులో సర్దింది.

"మీ ఫ్రెండ్స్ కెవరికీ తుపాకుల్లేవు, అయినా మీ వెంట ఎందుకు వస్తున్నారు?" అడిగింది ఆవిడ బయలుదేరుతున్న భర్తని.

"ఎందుకంటే చూడడానికి.."

భర్త కారులో బయలుదేరిన మర్నాడు ఉదయం ధర్మేంద్ర భార్య అతని ఫ్రెండ్స్ ఇళ్ళకి ఫోన్ చేసింది. ఆవిడ ఊహించినట్లుగానే జవాబు వచ్చింది. వాళ్ళెవరూ ధర్మేంద్ర వెంట వెళ్ళలేదు. ధర్మేంద్ర కారు నిజానికి అతని గర్ల్‌ఫ్రెండ్ ఇంటి ముందు ఆగి ఉంది. ఆ రాత్రంతా, మర్నాడు రాత్రి కూడ.

సోమవారం ఉదయం ధర్మేంద్ర కారు వచ్చింది. హారన్ విని అతని భార్యగేటు తెరిచింది.

కారు దిగి పారదర్శకమైన ప్లాస్టిక్ బేగ్ లోని కుందేళ్ళని రెంటిని భార్యకి చూపించి గర్వంతో చెప్పాడు ధర్మేంద్ర -

"చూశావటోయ్! నాలుగు రాళ్ళు ఖర్చయినా, రెండు కుందేళ్ళని వేటాడి తెచ్చాను.."
ధర్మేంద్ర జుట్టుపట్టుకుని అతని తలని ఎత్తి, అపరకాళికలా చూస్తూ అడిగింది అతని భార్య.
"అలాగా! అసలు నేను తుపాకితో పాటు తుపాకి గుళ్ళు పెట్టకపోయినా అవి మీకు ఎక్కడినుంచీ వచ్చాయి?"
వెంటనే ధర్మేంద్ర కలవరపడ్డాడు..!

***

## చౌచౌ... పెరుకొచ్చిన నవ్వులు

ఒక టీచర్ క్లాసులో పిల్లలకు సారాయి వల్ల కలిగే దుష్పరిణామాలను ఇలా వివరిస్తున్నాడు. "ఉదాహరణకు కొన్ని మొక్కలకు రోజూ కొంచెం కొంచెం నీళ్ళుపోస్తూ ఉంటాం అనుకోండి. అప్పుడా మొక్కలు పచ్చగా దినదినాభివృద్ధి పొందుతాయి. నీటికి బదులు సారాయిపోశాం అనుకోండి. అప్పుడా మొక్కలు వాడిపోయి కొద్దిరోజుల్లో ఎండిపోతాయి. ఈ ఉదాహరణ వలన మీకేం తెలుస్తుంది?"
"కడుపులో మొక్కలు పెరుగుతున్నప్పుడు నీటికి బదులుగా సారాయి తాగరాదు. తాగితే అవి చస్తాయి"

కంట్రాక్టర్ రోడ్డు వేస్తున్న కూలీలను పర్యవేక్షించటానికి వచ్చేటప్పటికి ఒక కూలిపిల్లవాడు పనిచెయ్యకుండా ఆడుకుంటూ కనిపించాడు. కంట్రాక్టర్ ఆ పిల్లవాడిని వెంటనే పనిలోనుండి తీసివేసి మేస్త్రిని పిలిచి "ఏమయ్యా ఆ కుర్రవాడు పనిచెయ్యకుండా గంతులేస్తుంటే నీవేం చేస్తున్నావ్?" అని గద్దించాడు.
"క్షమించండి సార్. ఈ పిల్లవాడు రోజూ వచ్చి ఇక్కడ ఆడుకుంటుంటే మీ పిల్లవాడు కాబోలని ఊరుకున్నాను"

రెండు రోజులు రైలు ప్రయాణం చేసి వచ్చిన మతిమరుపు ప్రొఫెసర్‌గారు చాలా అలసిపోయారు. హోటల్ తిండి పడక డిసెంట్రీకూడా పట్టుకుంది. దానికి తోడు రిజర్వేషన్‌లో పై బెర్తుదొరికింది. " పై బెర్తు మూలంగా తెల్లవారే వరకు ఎక్కటం, దిగటంతో నా ప్రాణం పోయిందనుకో" అన్నాడాయన భార్య దగ్గర తన బాధలు చెప్పుకుంటూ.

"అటువంటప్పుడు క్రింది బెర్త్ ఆయన్ను బ్రతిమాలుకుని బెర్తులు మార్చుకోవచ్చుకదా" అందావిడ.

"అవును నేనూ అలాగే అనుకున్నాను. కాని క్రింద బెర్తుమీద ఎవరూలేరు. ఖాళీగా ఉంది. ఏం చెయ్యను?" వాపోయాడాయన.

"చూడండి. మీరు రికమెండ్ చేశారు కదాని ఆ కుర్రాడికి ఉద్యోగం యిచ్చాను. కాని అతను బుద్ధిమంతుడిలా కనిపించటంలేదే?"

"అలా అనకండి. కేవలం ముఖం చూసి నాలుగురోజుల్లో అటువంటి నిర్ణయానికి రాకూడదు."

"ఆ కుర్రాడి ముఖం చూసి నేనిది చెప్పటంలేదు. మీరు పంపించిన రోజే డబ్బిచ్చి బ్యాంకులో కట్టి రమ్మని పంపాను. అప్పుడు వెళ్ళినవాడు ఈ రోజు వరకు తిరిగి రాలేదు. ఇక అతని ముఖం చూసిందెప్పుడు?"

కోర్టులో విసుగెత్తిపోయిన జడ్జిగారు

"విడాకులెందుకు కావాలయ్యా నీకు?"

"నా భార్య నాతో మాట్లాడి మూణ్ణెల్లయ్యింది"

"ఎంత అదృష్టవంతుడివి నువ్వు, ఖర్మ అంత మంచి పెళ్ళాం దొరికినందుకు సంతోషించక ఇంత దూరం రావటమేమిటయ్యా"

అరెరే! ఇనప్పెట్టె తాళం వేయటం మర్చిపోయి బజారుకు వచ్చేశామే. దానిలో మొన్న బ్యాంక్ నుంచి తెచ్చిన పదివేలు ఎలా ఉన్నాయి?" అన్నాడాయన భార్యతో.

"ఫర్వాలేదు భయపడకండి. నేను యిక్కడే ఉన్నానుగా" అంది భార్యామణి.

కొందరు యువకులు ఊళ్ళో స్విమ్మింగ్‌పూల్ నిర్మించటానికి చందాలు పోగు చేస్తూ "అందరికి ఉపయోగకరమైన ఈ స్విమ్మింగ్‌పూల్‌కు మీకు తోచిన చందా ఇవ్వండి" అన్నారు శెట్టిగారితో.

"తప్పకుండా నా చందాగా అయిదు బిందెల నీళ్ళు రాసుకోండి" అన్నాడాపీనాసి.

పేపర్ చదువుతున్న భర్తకు కాఫీ యిచ్చి, "ఏమిటండీ పేపర్లో విశేషాలు?" అనడిగింది భార్య.

"ఏమంత పెద్ద విశేషాలు లేవులే. మూడుచోట్ల మానభంగాలు, ఒక రైలు ప్రమాదం, ఒక బ్యాంకు దోపిడి, రెండుచోట్ల హత్యలు, ఒక ఆత్మహత్య. అంతే. అన్నీ మామూలు విషయాలేనే"

"ఈ కేసులో నువ్వు సాక్షివి. ముద్దాయి, అతని భార్య కొట్టుకుంటుండగా నువ్వు చూశావని చెబుతున్నారు. వాళ్ళ తగువు ప్రారంభం నుంచి నువ్వక్కడే ఉండటంవల్ల తప్పెవరిదో నువ్వే చెప్పగలవు. జరిగింది జరిగినట్టుగా నిష్పక్షపాతంగా, అంతా నిజమే చెప్పాలి. తప్పెవరిది?" ప్రశ్నించాడు న్యాయమూర్తి.

"తప్పు నాదండయ్యా"

"నీదా?"

"అవునండి. ఆ సమయానికి నేనక్కడుండటం పెద్ద తప్పని ఇప్పుడర్థమయిందండీ"

నిత్యజీవితంలో సంఘటనలయితే తేలికగా అర్ధమవుతాయని ఒక స్కూలు మాస్టారు నాలుగో క్లాసు కుర్రాణ్ణి ఇలా ప్రశ్నించాడు.

"మీ మామయ్య ఇంటద్దె నాలుగు వందల యాభై, కిరాణా కొట్టువాడికి మూడువందల ఇరవై బాకీ ఉన్నాడనుకో. అతను మొత్తం ఎంతివ్వాల్సి ఉంటుంది?"

విద్యార్థి తడుముకోకుండా జవాబు చెప్పాడు

"ఏమీ ఇవ్వక్కర్లేదండీ  అందాక వస్తే మా మామయ్య రాత్రికి రాత్రి ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోతాడు."

COMMENTS